


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 20-8-2025

సంపుటి: 21 సంచిక: 127
పేజీలు: 8 వెల: రూ.1



# కూనది కేవలం సిఫారసే..
# ఏపీసీ చేసింది 'ఫార్స్'!





- ఎమ్మెల్యేలు ఫిర్యాదులు పంపడం కామన్
- వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సింది అధికారులే
- విచారించకుండానే సౌమ్యపై కలెక్టర్‌కు ఏపీసీ ఫైల్
- చేతులు కాలాక ఇప్పుడు ఎంక్వైరీ చేపడుతున్న వైనం
- శశిభూషణ్ నిర్వాకంతో ఎమ్మెల్యే కూన రాజకీయానికి రిమార్క్

ఆయనకు రూల్స్ పెడితే నచ్చవు. వాటిని పాటించడానికి అస్సలు ఇచ్చగించరు. థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీని.. నాకే చెబుతారా? అంటూ నానా యాగీ చేస్తారు. తమ్ముడు తమ్ముడే.. పేకాట పేకాటే.. ఎవరికైనా నిబంధనలు ఒకటే అని ఎవరైనా అంటే వారి మీదే అవాకులు, చవాకులు పోగేసి ఫిర్యాదులు చేస్తారు. విచారణ చేపట్టమని కోరుతారు. పోనీ ఫిర్యాదైనా నేరుగా చేస్తారా? అంటే.. అలా చేయరు. ఆకాశరామన్న పేరుతోనో, నకిలీ ఆర్టీఐ కార్యకర్త పేరుతోనో ఓ కాగితం పంపిస్తారు. తీరా విచారణకు వెళితే వీరెవరూ సంబంధిత అడ్రసుల్లో ఉండరు. సమగ్ర శిక్ష ఏపీసీ శశిభూషణ్‌కు ఈ అవలక్షణాలన్నీ అతికినట్లు సరిపోతాయి. ఆయనగారి ఈ తెంపరితనమే ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ రాజకీయ జీవితంపై మరక పడేలా చేసింది. ప్రజాప్రతినిధిని వివాదంలోకి నెట్టింది. అధికారంలో ఉన్న నాయకులు సవాలక్ష సిఫార్సులు చేస్తారు. అందులోనూ తమ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగి తమ మాట వినడంలేదన్న దానికంటే ప్రత్యర్థి పార్టీ చెప్పినవి చేస్తున్నారన్న మాట చెవికెక్కితే మరింత బిగుసుకుపోతారు. వీటిని గుర్తించి సమస్యలు ఏర్పడినా సందర్భాల్లో సంయమనంతో సర్దుబాటు చేయడం ద్వారా ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల మధ్య సంధానకర్తగా వ్యవహరించాల్సిన ఒక విభాగాధిపతి లెక్కలేనితనంతో ఒక రాజకీయ నాయకుడి జీవితాన్ని నడిరోడ్డు మీద నిలబెట్టారు. వివరాల్లోకి వెళితే..

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గతంలో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల లెక్చరర్‌గా పని చేస్తున్నప్పుడు వ్యవహరించిన తీరుగానే ఏపీసీ అయిన తర్వాత శశిభూషణ్ వ్యవహరిస్తూ చేసిన నిర్వాకం వల్ల ఎమ్మెల్యే కూన రవికుమార్ సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సహజంగానే దుందుడుకు స్వభావం కలిగిన కూన రవికుమార్ లోలుగు (పొందూరు) కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య విషయంలోనూ అదే దుడుకుతనం ప్రదర్శించి ఉంటారన్న ఉద్దేశంతో దళిత సంఘాలు ఉద్యమాన్ని తీవ్రతరం చేశాయి. ఇక్కడే ఏపీసీగా శశిభూషణ్ నిబంధనలు ఫాలో అయ్యుంటే.. రూల్స్ ప్రకారం వ్యవహరించి ఉంటే ఎవరూ ప్రశ్నించే సాహసం చేసే పరిస్థితి ఉండేది కాదు. కానీ తన లెక్కలేనితనం, పదవిని కాపాడుకునే యావలో ఆయన.. కేవలం ఎమ్మెల్యే సిఫార్సు చేశారన్న ఒకే ఒక్క సాకుతో ఫైలు నడిపించి పొందూరు నుంచి కంచిలి కేజీబీవీకి సౌమ్యను బదిలీ చేస్తూ కలెక్టర్ ద్వారా ఆదేశాలిప్పించేశారు. దీంతో సౌమ్య తన బదిలీకి కూన రవికుమారే కారణమన్న ఆవేశంతో ఆయన మీదే ఆరోపణలు ఎక్కుపెట్టి.. దేనితో కొడితే నాయకులు తగ్గుతారో.. అదే ఆయుధాన్ని ప్రయోగించారు.

### ఫిర్యాదుల ఆధారంగానే లేఖ


కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యపై పేరెంట్స్ కమిటీతో పాటు అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు కూడా ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటికే ఎమ్మెల్యే అయిన తన సిఫార్సుల కంటే ప్రతిపక్షంలో ఉన్న నాయకుల మాటలకు ఎక్కువ విలువ ఇస్తున్నారన్న అభిప్రాయం కూన రవిలో ఉంది. కేజీబీవీలో సీట్లంటే వీఐపీ సీట్లన్నంత క్రేజ్ ఉంది. ఆరో తరగతిలో 40 సీట్లుంటే ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఎవరికి సీటు వచ్చింది, ఎవరికి రాలేదు అనేది విద్యార్థుల తల్లిదండ్రులకు ముందు తెలియదు. ప్రతి కేజీబీవీకి సంబంధిత జాబితా నేరుగా వెళ్లిపోతుంది. అక్కడి ప్రిన్సిపాల్ తలచుకుంటే రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం నుంచి వచ్చిన జాబితాలో ఉన్న విద్యార్థులు చేరకపోవడం వల్ల

- మిగతా చివరి పేజీలో

# మొన్న ప్రభుత్వ భూమి..
# నేడదే జిరాయితీ!


ఆక్రమించిన స్థలం

- రీసర్వేలో ప్రభుత్వ భూముల్ని కట్టబెట్టేస్తున్న రెవెన్యూ
- ప్రభుత్వ పాఠశాల విస్తీర్ణం ప్రైవేటుకు ధారాదత్తం
- ప్రభుత్వం సేకరించిన భూమి మధ్యలో జిరాయితీ ఉందంటున్న యంత్రాంగం
- ఫిర్యాదు పరిష్కారానికి 105 రోజులు గడువు




ప్రభుత్వ భూమిగా చూపిస్తున్న అడంగల్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ భూమి రోజుల వ్యవధిలో జిరాయితీగా మారిపోయింది. జులై 7 నాటికి ప్రభుత్వ భూమిగా రికార్డుల్లో నమోదైవుంటే ఆతర్వాత రోజు జిరాయితీగా మారిపోయింది. ఈ ఉదాహరణ రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది అక్రమాలకు శాంపిల్ మాత్రమే. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన కాలనీలో జిరాయితీ భూమి ఉందని రెవెన్యూ అధికారులు చెప్పడంపై గార మండలం కళింగపట్నం మత్స్యలేశం (కె.మత్స్యలేశం) ఎన్టీఆర్ కాలనీవాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉన్నా, భూమి స్వభావాన్ని రీసర్వేలో జిరాయితీగా మార్చి కట్టబెట్టేశారు. దీనిపై కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కారానికి 105 రోజులు గడువు ఇచ్చారు. రెవెన్యూ రికార్డుల ప్రాప్తికి సర్వే నెం-211/6 (రీసర్వే ఎల్పీఎం నెంబర్ 1036)లో ప్రభుత్వ భూమి 1.56 ఎకరాలుగా నమోదై ఉంది. దీన్ని రీసర్వే తర్వాత గ్రామానికి చెందిన తయ్యి సుభద్రమ్మ పేరుతో జిరాయితీగా మార్చి విస్తీర్ణాన్ని 1.82 ఎకరాలుగా నమోదు చేశారు. వాస్తవంగా తయ్యి సుభద్రమ్మ మృతిచెంది దశాబ్ధం అయింది. సుభద్రమ్మకు వారసత్వంగా వచ్చినట్టు చూపించి ఆమె వారసులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిసింది. సర్వే నెం-211/8 (ఎల్పీఎం నెంబర్ 1037)లో 1.75 సెంట్లు జిరాయితీ భూమి ఉంది. ఈ సర్వే నెంబర్‌లో తయ్యి సుభద్రమ్మ పేరున 29 సెంట్లు, రాజారావు పేరున 38 సెంట్లు, తయ్యి మేరీ పేరున 33 సెంట్లు, ఎంపీయూపీ మోడల్ స్కూల్ పేరున 50 సెంట్లు, ఎవరికి చెందని భూమి 25 సెంట్లుగా రికార్డు చేశారు. రీసర్వే తర్వాత ఈ సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాల విస్తీర్ణం 50 సెంట్లు నుంచి 30 సెంట్లకు కుదించి ప్రత్యేకంగా ఒక ఎల్పీఎంను ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలను మినహాయించిన తర్వాత సర్వే నెంబర్ 211/8లో 1.75 ఎకరాలకు గాను విస్తీర్ణంను 2.06 ఎకరాలకు పెంచి రెవెన్యూ అధికారులు వన్‌బీలో చూపించారు. అదనంగా వన్‌బీలో నమోదు చేసిన భూమిని తయ్యి దమయంతి, సుభద్రమ్మ, మేరీ, రాంబాబు, దాసరి సరస్వతి పేర్లతో ఒక్కొక్కరికీ 2.06 ఎకరాలు వారసత్వంగా దఖలుపడినట్టు నమోదు చేశారు. సర్వే నెంబర్ 210, 211/6 లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో అనేక కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ నివాసాలకు రహదారి సౌకర్యం లేకుండా రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రభుత్వ భూమిని ఆక్రమించి యంత్రాల సాయంతో చదును చేసి నిర్మాణాలు చేపట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని గార తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని స్థానికుడు బొంది రమణారావు చెబుతున్నారు. దీంతో కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మండల రెవెన్యూ అధికారులు, కె.మత్స్యలేశం సచివాలయం సర్వేయర్ అక్రమాలకు పాల్పడినట్టు కాలనీవాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రణాళిక ప్రకారం రెవెన్యూ అధికారులు, సచివాలయం సిబ్బంది అక్రమార్కులతో చేతులు కలిపి ప్రభుత్వ భూమిని జిరాయితీగా మార్చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమాలను సక్రమం చేసుకోవడానికి రీసర్వేను అవకాశంగా తీసుకొని అవకతవకలకు పాల్పడినట్టు స్థానికులు చెబుతున్నారు. అవకతవకలపై విచారణ జరిపి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఈ రెండు సర్వే నెంబర్లతో పాటు మిగతా సర్వే నెంబర్లలోనూ ఇదే పద్ధతిలో ప్రభుత్వ భూమిని రీసర్వేలో జిరాయితీగా మార్చేశారని కె.మత్స్యలేశం గ్రామస్తులు చెబుతున్నారు. జాయింట్ ఎల్పీఎంలు ఇచ్చి కొందరిని నట్టేట ముంచారని, భూవిస్తీర్ణం తక్కువ చూపించి వేరొకరి ఖాతాలో మిగతా భూమిని చేర్చారని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. గ్రామం పరిధిలో చేపట్టిన రీసర్వేలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో బొంది రమణారావు కోరారు.


ఆక్రమించిన స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం



ప్రభుత్వ భూమిని జిరాయితీగా మార్చిన అడంగల్

• ఎడిటోరియల్

# వలసలు కాదు.. నిరుద్యోగమే అసలు సమస్య

దేశ జనాభా స్వరూపం మారిపోతోందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి అడ్డుకట్ట వేయడానికి 'అధికార జనాభా మిషన్' ఏర్పాటు చేస్తామని కూడా అప్పటికప్పుడే ప్రకటించారు. జనాభా స్వరూపం మారడం అంటే ఏమిటి? అన్న సందేహం కలగవచ్చు. సాధారణంగా జనసంఖ్య పెరగడమో.. తరగడమో.. జరుగుతుందే తప్ప స్వరూపం మారడం దాదాపు అసాధ్యం. కానీ సాక్షాత్తు ప్రధాని నోటి వెంట ఆ మాట రావడంతో ఆయన భావమేమిటని ఆలోచిస్తున్నంతలోనే.. మోదీయే దానికి అర్థం చెప్పేశారు. దేశంలో వలస దారుల అక్రమ చొరబాట్లు పెరిగిపోతున్నాయని.. ఇది దేశ జనాభా స్వరూపాన్ని మార్చేందుకు పక్కా ప్రణాళికతో జరుగుతున్న కుట్ర అని ప్రధాని అభివర్ణించారు. అక్రమ వలసదారులు మన యువత ఉపాధిని లాక్కుంటూ.. మన సోదరీమణులను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. కానీ ప్రధాని పేర్కొన్న అంశాల్లో ఎంతవరకు వాస్తవం? దానికి ఆధారంగా ఏవైనా గణాంకాలు ఉన్నాయా?? జనాభా విషయంలో అసలు సిసలు సవాలు ఇదేనా? అంటే కచ్చితంగా ఇదేనని చెప్పలేని పరిస్థితి. ప్రభుత్వ వాదనలను నిర్ధారించాలంటే జాతీయ జనాభా లెక్కలే(సెన్సస్) ప్రామాణికం. కానీ దురదృష్ట వశాత్తు గత 14 ఏళ్లుగా దేశంలో జనాభా లెక్కల సేకరణే జరగలేదు. ఫలితంగా 2011 తర్వాత జనాభాలో చోటుచేసుకుంటున్న మార్పులపై సమగ్ర సమాచారం అందుబాటులో లేదు. అది లేకుండా జనాభా స్వరూపం మారిపోతోందని చెప్పడం ఊహాగానమే అవుతుంది. జనాభా లెక్కలు లేకపోయినా అందుబాటులో ఉన్న ఇతర గణాంకాలు భిన్నమైన చిత్రాన్ని చూపుతున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం దేశంలో సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) రెండు శాతానికి పడిపోయింది. జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 శాతం కంటే ఇది తక్కువ. ఈ తగ్గుదల అన్ని మత సమూహాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ముస్లింల సంతానోత్పత్తి రేటు 1992లో 4.4 ఉండగా 2019 నాటికి 2.4 శాతానికి తగ్గింది. ప్రభుత్వం జనాభా పెరుగుదలను ముప్పుగా చిత్రిస్తుంటే ఆర్థికవేత్తలు దీన్ని 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' అనే అద్భుతమైన అవకాశంగా చూస్తున్నారు. అంటే.. దేశ జనాభాలో పనిచేసే వయసు (15-64 ఏళ్లు) వారు ఎక్కువగా ఉండటమనే సువర్ణావకాశం ముంగిట భారతదేశం ముంగిట ఉంది. జనాభాలో సుమారు 68 శాతం మంది పనిచేసే వయసువారే. నిపుణుల అంచనా ప్రకారం ఈ ప్రయోజనాన్ని అందిపుచ్చుకోవడానికి మనకు 2041 వరకు మాత్రమే సమయం ఉంది. కానీ ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకుంటున్నామా అంటే వాస్తవాలు నిరాశ కలిగిస్తున్నాయి. దేశ యువత తీవ్రమైన సమస్యలతో సతమతమవుతోంది. ఇదే అసలైన జనాభా సంక్షోభం. నిరుద్యోగుల (15-29 ఏళ్లు) సంఖ్య పది శాతం దాటింది. ఇందులో పట్టభద్రులే 29 శాతం మేరకు ఉన్నారు. ఇది నిరుద్యోగ సమస్యకు నిదర్శనం. ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతున్నా తగినన్ని ఉద్యోగాలు సృష్టించలేకపోతున్నాం. విద్యా వ్యవస్థకు, పరిశ్రమల అవసరాలకు మధ్య పెద్ద అగాథం ఏర్పడటమే ఈ పరిస్థితికి కారణం. ఫలితంగా మన పట్టభద్రుల్లో సగం మంది మాత్రమే ఉద్యోగాలకు అర్హులుగా ఉంటున్నారు. మరోవైపు దేశంలో మహిళల శ్రామిక భాగస్వామ్య రేటు (ఎఫ్ఎల్ఎఫ్‌పి) చాలా తక్కువగా 24-32 శాతం మధ్య ఉంది. అంటే మానవ వనరుల్లో సగం శక్తిని మనం వృథా చేసుకుంటున్నామన్నమాట. ఆందోళన కలిగించే మరో సమస్య ఏమిటంటే.. దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా వృద్ధాప్యం వైపు పయనిస్తుంటే.. ఉత్తరాది రాష్ట్రాల్లో యువ జనాభా పెరిగిపోతోంది. వారికి విద్య, ఉపాధి కల్పించడం పెను సవాలుగా మారింది. ప్రభుత్వం చెబుతున్న 'వలసల ముప్పు' కథనానికి.. వాస్తవ గణాంకాలకు పొంతన లేదన్నది వీటి వల్ల తేటతెల్లమవుతుంది. అసలైన జనాభా సంక్షోభం మోదీ చెప్పినట్లు బయటి నుంచి రావడం లేదు. అది మన కళ్ల ముందే కనిపిస్తోంది. కోట్లాది మంది నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారికి తగిన ఉద్యోగాలు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారు. వీటన్నింటినీ ప్రభుత్వ విధానాల వైఫల్యాలుగానే పరిగణించాల్సి ఉంటుంది. వీటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రధానమంత్రి వలసల ముప్పు వాదనను ప్రజానీకంలోకి వదిలినట్లు కనిపిస్తోంది. దేశ భవిష్యత్తుకు అసలైన ముప్పు వలసదారులు కాదని.. మన యువతకు ఉద్యోగాలు కల్పించలేకపోవడమనే వాస్తవాన్ని ప్రభుత్వం ఎంత త్వరగా గుర్తించగలిగితే అంత మంచిది.

## ఢిల్లీరావు మృతి తీరనిలోటు


(సత్యంన్యూస్, పలాస)

సీపీఎం సీనియర్ నాయకులు బత్తిని ఢిల్లీరావు మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహన్‌రావులు అన్నారు. మండలంలోని బొడ్డపాడు గ్రామంలో ఢిల్లీరావు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అనంతరం తెప్పల అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సంతాపసభలో వారు మాట్లాడుతూ ఢిల్లీరావు తన యావత్ జీవితాన్ని కార్మిక వర్గంకు అంకితం చేశారన్నారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ కార్యదర్శిగా పనిచేస్తూ కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారని గంగవరం పోర్టు ఉద్యమంలో 40రోజులపాటు జైల్లో ఉన్నారని ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడిన ఒక గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ సంతాప సభలో సీఐటీయూ నాయకులు యన్ గణపతి, ప్రజా సంఘాల నాయకులు టి.రాజు, తాతరావు, యం.జీవనరావు, బొడ్డు సింహాద్రి, పి.లక్ష్మణరావు, పి.గీతమ్మ, బి.పాపారావు, తదితరులతోపాటు కుటుంబసభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## 'రంగుల ఆహారానికి' ప్రాధాన్యతనివ్వకండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆరుబయట దొరికే "రంగురంగుల ఆహారానికి" ప్రాధాన్యతనివ్వకండని ప్రముఖ వైద్యులు మొదలవలస మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ మార్పుల దృష్ట్యా విషజ్వరాలు ప్రబలే అవకాశముం దని, పరిసర ప్రాంతాలలో వర్షపు నీళ్లగుంతలు లేకుండా చూసుకోవాలని, ఇంటిలో పేరుకుపోయిన చెత్తను, ఎప్ప టికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. నీటి నిల్వలతో దోమలకు నివాసంగా మారి, విషజ్వరాలే కాకుండా, అనేక రోగాలకు దారి తీస్తుందన్నారు. వీలైనంతవరకు దోమతెరలను వాడాలని, కాచి వడపోసిన నీళ్లను త్రాగటం శ్రేయస్కరమన్నారు. బయట దొరికే ఆహారానికి దూరంగా ఉంటూ, ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని తీసుకోవాలని, నిల్వ ఉన్న ఆహారాలు తినటం వలన అనారోగ్యం బారిన పడతామన్నారు. విషజ్వరాలతో పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు వస్తున్నారని, వైద్య శాలలకు ధనాన్ని వృథా చేసే బదులు, తగిన జాగ్రత్తలను తీసుకుంటే ధనంతో పాటు, ఆరోగ్యవంతమైన జీవితం మన సొంతమవుతుందన్నారు. జ్వరమే కదా అని అశ్రద్ధ చేయవద్దని, సమీప వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు.




ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ గ్రీన్‌పార్క్ హోటల్‌లో ఉత్తమ ఫోటో జర్నలిస్టులకు అవార్డులు ప్రధానం చేశారు. దీనిలో భాగంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు కేటగిరీలో అదిలాబాద్ జిల్లా ఈనాడు ఫోటోగ్రాఫర్ సింహాచలంకు ప్రోత్సాహక బహుమతి లభించింది. ఈ అవార్డును సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక, ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డిల చేతుల మీదుగా అందుకున్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

(సత్యంన్యూస్, సోంపేట)

మండలంలోని గొల్లగండి పంచాయతీ గొల్లగండి కాలనీలో దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న నీటిసమస్య పరిష్కారమైందని గొల్లగండి మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు గండుపల్లి చిన్న రాజారావు తెలిపారు. ఈమేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో నెలకొంటున్న నీటి సమస్య విషయమై ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, ఇచ్ఛాపురం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త దాసరి రాజులకు వినతిపత్రం అందించానన్నారు. గత మూడు సంవత్సరాలుగా ఉద్దానం నీటి పైప్ లైన్ సమస్య కారణంగా కాలనీ మహిళలు, వృద్ధులు ప్రతిరోజూ వీధి మొదట్లోని వాటర్‌ట్యాంకు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇది వారి దైనందిన జీవితంలో ఎన్నో ఇబ్బందులకు కారణమైందన్నారు. వీటిని వినతిపత్రం రూపంలో వారికి వివరించామన్నారు. వీటికి స్పందించిన వారు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారన్నారు. దీనిలో భాగంగా మంగళవారం మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు ఆదేశించారన్నారు. సమస్య పరిష్కారానికి అన్ని విధాలుగా సహకరించిన సర్పంచ్ నాగం భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ శాఖ అధికారులకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారన్నారు.



## నియామక పత్రాలు అందజేత

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా పరిషత్ పరిధిలో ఉపాధ్యాయులు, ఉద్యోగులుగా వివిధ కేడర్లలో పని చేస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు సాంఘిక భద్రతా పథకం కింద కారుణ్య నియమకాలను చేపట్టారు. ఈమేరకు వీటికి సంబంధించిన నియామకపత్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం ఆమె అధికారిక నివాసంలో అందజేశారు. కారుణ్య నియామకాలు తీసుకున్న వారిలో కొండగొర్రి రాహుల్, తీడ తేజేశ్వరరావు, సూరవజ్జల రాజ్యలక్ష్మి వేమూరి నాగమణిలున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ కొత్తగా నియమించిన అభ్యర్థులు చక్కగా పని చేస్తూ, మీరు పని చేసే కార్యాలయానికి, జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యానికి మంచి పేరు, ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఈఓ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజా, డిప్యూటీ సీఈఓ డి.సత్యనారాయణ, సి.సెక్షన్ సిబ్బంది, జూనియర్ సహాయకులు పాల్గొన్నారు.





## ఇంట్రెస్టింగ్‌గా రష్మీక వరల్డ్ ఆఫ్ థామా

రష్మిక మందన వరుస హిట్స్‌తో దూసుకుపోతుంది. ఒక సినిమా తర్వాత మరొక సినిమా వస్తూనే ఉంది. రష్మిక నటించిన గర్ల్ ఫ్రెండ్ మూవీ రిలీజ్ కు రెడీ ఉంది. ఇక అది కాకుండా ఫిమేల్ ఓరియెంటెడ్ మూవీ ఒకటి అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు బాలీవుడ్ లో మరొక ఇంట్రెస్టింగ్ మూవీతో రానుంది రష్మిక. బాలీవుడ్ లో కొత్త జోష్ ని తీసుకుని వచ్చిన హర్రర్ కామిడి యూనివర్స్ గురించి తెలిసిందే . ఈ యూనివర్స్ నుంచి స్త్రీ, భేడియా, ముంజ్య, స్త్రీ 2 లాంటి సినిమాలు బాక్స్ ఆఫీస్ దగ్గర విధ్వంసం సృష్టించిన సంగతి తెలియనిది కాదు. ఇప్పుడు ఇదే యూనివర్స్ నుంచి రష్మిక లీడ్ రోల్ లో 'థామా' అనే మూవీ రాబోతుంది. రష్మిక మందన్నా, ఆయుష్మాన్ ఖురానా జంటగా నటిస్తున్న సినిమా ఇది. తాజాగా దీనికి సంబందించిన టీజర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. రష్మిక కొత్త గెటప్ లో కనిపిస్తూ అందరిని ఆశ్చర్యపరిచింది. రష్మిక ఇప్పటివరకు ఇలాంటి రోల్ లో నటించింది లేదు.. హర్రర్ టచ్ లో కనిపించడం ఇదే మొదటి సారి. ఈ సినిమాను ఈ దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. సో ముందు ముందు సినిమా నుంచి ఎలాంటి అప్డేట్స్ వస్తాయో చూడాలి.

ఐడ్రీమ్‌పోస్ట్.కామ్ సౌజన్యంతో..

## ఏందమ్మా జాకీ ఈ పులి వేషం?

అందాన్ని అందంగా ప్రెజెంట్ చేయడం ఒక కళ. ఈ కళలో చాలా ఆరితేరిపోయింది జాక్విలిన్ ఫెర్నాండెజ్. ఈ శ్రీలంకన్ బ్యూటీ బికినీ బీచ్ సెలబ్రేషన్, ముంబైలో ర్యాంప్ వాక్‌లు, ఐపీఎల్ సీజన్‌లో డ్యాన్సులు మెరుపులతో ప్రతిసారీ తనదైన ప్రత్యేకతను చాటుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉంది. ప్రతిసారీ వేదిక ఏదైనా తానే కేంద్రక ఆకర్షణగా మారుతోంది. ఫ్యాషన్ సెన్స్‌పరంగా నిరంతరం యువతరంలో స్ఫూర్తి నింపుతూనే ఉంది. తాజాగా జాక్విలిన్ స్పెషల్ ఫ్రాక్‌లో కనిపించి ఆశ్చర్యపరిచింది. ఇది చూడగానే ఏంటమ్మా ఈ పులి వేషం? అంటూ అభిమానులు సరదాగా వ్యాఖ్యానిస్తున్నారు. జాకీ ఈసారి సేవ్ టైగర్స్ అని నినదిస్తుందా? అంటూ కొందరు కామెంట్లు చేస్తున్నారు. అందమైన టైట్ ఫిట్ ఫ్రాక్‌పై టైగర్ ఫోటోలను ముద్రించిన ప్రింటెడ్ డిజైనర్ డ్రెస్ నిజంగా అందరినీ ఆకట్టుకుంది. బ్యాక్ లెస్, షోల్డర్ లెస్ లుక్స్ సహా రకరకాల భంగిమల్లో జాకీ అదిరిపోయే ఫోజులిచ్చింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారుతోంది. నిజమైన టైగర్ అయినా అలా జాక్విలిన్ ముందు నడుచుకుంటూ వెనక్కి తిరిగి చూడాల్సిందే! అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. జాక్విలిన్ కెరీర్ మ్యాటర్‌కి వస్తే "వెల్ కం బ్యాక్ 3" మినహా చేతిలో ఎలాంటి ప్రాజెక్టులు లేవు. జైలు నుంచే తన ప్రియుడు సుకేష్ చంద్రశేఖర్ చాలా ప్రాజెక్టులు ఆఫర్ చేస్తున్నాడు. కానీ వాటిని జాకీ తిరస్కరిస్తూ పరువు కాపాడుకునే పనిలో పడింది. మరోవైపు జాక్విలిన్ 120 కోట్ల పైబడిన నికర ఆస్తులతో రిచెస్ట్ హీరోయిన్లలో ఒకరిగా కొనసాగుతోంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో..



## లిటిల్ హార్ట్స్: ఇంటర్ ప్రేమలు, నవ్వులు

ఈటీవీ విన్ ఒరిజినల్ కంటెంట్ క్రియేట్ చేయడంలో స్పీడు పెంచింది. 90స్, వీరాంజనీలు విహారయాత్ర, అనగనగా, ఎయిర్ లాంటి చిత్రాలు ప్రేక్షకుల ఆదరణ అందుకున్నాయి. ఇప్పుడు యువ నటీనటులు మౌలి, శివానీ నాగారం కీలక పాత్రల్లో 'లిటిల్ హార్ట్స్' చిత్రాన్ని తీసుకొస్తున్నారు. సాయి మార్తాండ్ దర్శకుడు. తాజాగా టీజర్ విడుదలైంది. ఇంటర్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే కథ ఇది. ఇంటర్ ప్రేమలు అనగానే నిబ్బా లవ్ స్టోరీస్ అనే ముద్రపడే ఛాన్స్ ఎక్కువ. అయితే ఈ కథని డీసెంట్‌గా డీల్ చేశారని టీజర్ చూస్తే అర్థమౌతుంది. టీజర్‌లో కొన్ని నోస్టాల్జిక్ మూమెంట్స్ ఉన్నాయి. ఎంసెట్ కోచింగ్, కుర్రాళ్ల గొడవలు, ఇంట్లో చీవాట్లు, ఓ క్యూట్ లవ్ స్టోరీ ఇవన్నీ మేళవింపుతో టీజర్ వదిలారు. 'ప్రతి మిడిల్ క్లాస్ ఫ్యామిలీలో ఇద్దరినీ ఎందుకు కంటారో తెలుసా? ఈ సొసైటీ పెట్టే ప్రెషర్‌కి ఒకడు పోయినా ఇంకొకడు ఉంటాడని' ఈ డైలాగ్ టీజర్‌లో కొసమెరుపు. అనగనగా సినిమాకి మంచి రెస్పాన్స్ వచ్చిన తర్వాత కొన్ని థియేటర్స్‌లో రిలీజ్ చేశారు. అయితే 'లిటిల్ హార్ట్స్'ని మాత్రం ముందుగా థియేటర్స్‌లో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. సెప్టెంబర్ 12న ఈ సినిమా విడుదల కానుంది.




-తెలుగు 360.కామ్ సౌజన్యంతో..

# కాళ్ల కింద నేల కదులుతోంది.. గమనించారా?



***సంక్షోభం అంటే ఏమిటి? యథాతథ స్థితి చెదిరిపోడానికి దారితీసే పరిణామాలేమిటి? సర్వంసహా చక్రవర్తులు, తిరుగులేని అధికారాన్ని చెలాయించే నియంతలు కూడా ఏదో ఒక దశలో ఎందుకు బలహీనులవుతారు? ధర్మం ఒక్కపాదం మీద కూడా నడవని స్థితి వచ్చినప్పుడు ఎందుకు లోకధేనువు కుప్పకూలిపోతుంది?***

నరేంద్రమోదీ, ఆయన పార్టీ నిన్నమొన్నటిదాకా సాగించిన విజృంభణ చూసినప్పుడు, కనుచూపు మేరలో దానికి నిష్కృతి కనిపించలేదు. బయటి నుంచి పోటీ ఇవ్వగల ప్రత్యర్థులు లేరు, లోపలి నుంచే ఎవరో ఒకరు అస్థిరపరిస్తే తప్ప, ఈ పాలనకు తిరుగులేదు అన్న విశ్లేషణలు వినిపిస్తూ వచ్చాయి. ఎన్నికల ద్వారా జరగగల మరమ్మతు కూడా 2024 సాధారణ ఎన్నికల్లో, గురికి బెత్తెడు దూరంలో నిలిచిపోయింది. ఊతకర్రల సాయంతో తాబేటినడక కాక, బయటి మద్దతుదారులను కూడా విధేయులను చేసుకుని ప్రభుత్వం పరుగులు తీస్తూనే ఉంది. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను ఖాతరు చేయని నిరంకుశత్వాన్ని నిలబెట్టినది ఏది? ప్రజామోదం కొంత, భారతీయసమాజంలో ఆలోచనాసరళిని, విశ్వాస సంపుటిని తలకిందులు చేయగలిగిన ప్రచార కథనాల ప్రభావం కొంత అధికార సౌధానికి సుస్థిరత ఇస్తూ వచ్చాయి. భారత రాజ్యాన్ని సరైన దారిలోకి మళ్లిస్తున్నాడని, లోపలి- బయటి శత్రువుల నుంచి ప్రజలను రక్షిస్తున్నాడని, మైనారిటీలను రెండో తరగతికి కుదించడం ద్వారా తమను ప్రథమశ్రేణిలోకి ఎదిగించాడని, కునారిల్లిపోయి ఆత్మవిశ్వాసం అంతరించిన భారతీయ ఆత్మకు విశ్వాసాన్ని, గర్వాన్ని సమకూరుస్తున్నాడని నరేంద్రమోదీని, రాజ్యాంగ వ్యవస్థల మీద కంటె హెచ్చు విశ్వాసంతో, ప్రజలు అభిమానించారు. తమకు మంచి చేస్తున్నప్పుడు, తమ మనోభావాలను ఉత్తేజపరుస్తున్నప్పుడు, రాజ్యాంగ విలువలను పాటిస్తే ఏమిటి, పాటించకపోతే ఏమిటి, వాటికి సవరింపులు చేస్తే ఏమిటి- అన్న బేఖాతరు ధోరణిలో మెజారిటీ భారతీయ సమాజం పడిపోయింది.

***మరి ఇప్పుడు అట్లాగే ఉందా? సజావుగా సాగుతున్న ఆకాశయానంలో ఈ కుదుపులు ఏమిటి?***

అందరూ అంగీకరించకపోవచ్చును కానీ, పదకొండు సంవత్సరాల తర్వాత నరేంద్రమోదీ ప్రభుత్వం మొదటిసారి గట్టి సవాల్‌ను ఎదుర్కొంటున్నది. అదేమిటి, ఇప్పుడు సాధారణ ఎన్నికలు లేవుకదా, బీహారో, తమిళనాడో గెలిచినా ఓడినా కలిగే అదనపు లాభం, అధిగమించలేని ప్రమాదం ఏముంటాయి? అన్న సందేహం కలుగవచ్చు. కానీ, ఇప్పుడు మాట్లాడుకుంటున్నది నైతిక సంక్షోభం గురించి, లెజిటిమసీ సంక్షోభం గురించి. మొదటిసారిగా ప్రజల మనస్సుల్లో బలంగా నాటుకున్న అవిశ్వాసం గురించి. నైతిక ప్రాతిపదికలనే అంగీకరించనివారికి నైతిక సంక్షోభమేమిటి అని విమర్శకులు ప్రశ్నిస్తారు. ఒంటి పాదంతో నడిచినప్పుడు కూడా, ఎంతో కొంత బేలన్స్ ఉంటుంది. ఆ ఒక్క కాలు కూడా కుంగినప్పుడు, వ్యవస్థ కంపిస్తుంది. నరేంద్రమోదీ, ఆయన పార్టీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి లెజిటమసీ ఇస్తున్న అంశాలన్నీ పూర్వపక్షమైపోతున్న సన్నివేశంలో ఇప్పుడు ఉన్నాము.

2014లో అధికారానికి వచ్చిన వెంటనే బీజేపీ మీడియాను ప్రక్షాళన చేసే పనిలో పడింది. సామాజిక మాధ్యమాలను బహుముఖ ప్రయోజనాలకు వినియోగించుకునే భారీ ప్రాజెక్టును మొదలుపెట్టింది. మరోవైపు, అధికార యంత్రాంగంలో మార్పులు చేసుకుంది. చట్టసభలలో తిరుగులేని బలం ఎలాగూ ఉంది. న్యాయవ్యవస్థతో కొంత సమస్య వచ్చింది కానీ, కీలక విషయాల్లో ఇబ్బందులు రాకుండా జాగ్రత్తపడింది. కొందరు న్యాయమూర్తులకు పదవీవిరమణ అనంతరం పునరావాసాలు కల్పించారు. కొందరి చేతికి కీలక వ్యాజ్యాలు రాకుండా చూసుకున్నారు. వ్యక్తిగతంగా ఒక్కొక్కరిని తగిన విధంగా చతుర్విధ ఉపాయాలతో నిర్వహిస్తూనే, మొత్తంగా న్యాయవ్యవస్థకు అధికారాలు తగ్గించడానికి ప్రయత్నాలు చేశారు. ప్రజలలో ప్రభుత్వానికి ఉన్న ఉద్వేగపూరితమైన మద్దతు, వివిధ వ్యవస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించడానికి అడ్డుగా ఉంటుంది కూడా. ఒక రకమైన భయంతో కూడిన ఒత్తిడి న్యాయమూర్తుల మీద కూడా పనిచేస్తూ ఉంటుంది. మరొక రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం, కమిషనర్ల ఎంపికలో ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేబినెట్‌మంత్రికి చోటు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ జరిగింది. ఫలితంగా, ముగ్గురి ఎంపిక కమిటీలో ప్రధాని, ఆయన కేబినెట్ సహచరులొకరు, ప్రతిపక్ష నాయకులు సభ్యులు కావడంతో ఏకపక్ష నిర్ణయాలకు ఆస్కారం కలిగింది. ఆ చట్టసవరణ న్యాయపరీక్షలో ఉండగానే, ప్రస్తుత కమిషనర్లను ఈ ఏడాది కొత్త పద్ధతిలో నియమించడం వివాదం అయింది. ప్రధాన న్యాయమూర్తిని ఎంపిక కమిటీ నుంచి తొలగించడంతో సగం విశ్వసనీయత కోల్పోయిన ఎన్నికల సంఘం, కొత్త నియామకాలు చేసిన తీరుతో మరింత అప్రదిష్ఠ పాలయింది.

నరేంద్రమోదీ ప్రభుత్వానికి జనాదరణ అందించిన అంశాలలో తీవ్ర జాతీయవాదం ఒకటి. పెహల్గాం సంఘటన అనంతరం మోదీ వెనుక సమీకృతమైన దేశం, పాకిస్థాన్ మీద బాలాకోట్ దాడులకు మించిన గట్టి చర్యను ఆశించింది. అట్లా ఆశించే విధంగా 'పెహల్గామ్' అనంతర కథనాలు ప్రభావితం చేశాయి కూడా. 'ఆపరేషన్ సిందూర్' అటువంటి సంతృప్తిని ఇస్తుందని మోదీ అభిమానులైన జాతీయవాదులు అనుకున్నారు. అర్థాంతరంగా ఆ సైనికచర్య ముగియడం, ఆ నిర్ణయం వెనుక తన ఒత్తిడి ఉన్నదన్నట్టుగా అమెరికా అధ్యక్షుడు పదే పదే ప్రకటించడం, మోదీ ప్రభుత్వ విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేసింది. పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చినందునే ఆపరేషన్‌ను నిలిపివేశాం అని ప్రభుత్వం ఎంత చెప్పినా, అందుకు విరుద్ధమైన ప్రకటనలు అమెరికా నుంచి, పాకిస్థాన్ నుంచి కూడా వచ్చాయి. పైగా, పాకిస్థాన్‌కు తాను అండగా ఉంటున్నట్టు డొనాల్డ్ ట్రంప్ అనేక సంకేతాలు ఇస్తూ వచ్చారు. మొన్నటి పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వం ఈ విషయంలో ఎంతో ఆత్మరక్షణలో పడినట్టు స్పష్టంగా కనిపించింది. ఈ నెలలో ప్రధాని అమెరికా పర్యటన, ట్రంప్‌ను మంచి చేసుకోవడానికేనని, అది ఎటువంటి ఫలితాలను ఇస్తుందో చెప్పలేమని అంటున్నారు. పాక్ వివాదానికి తోడు, టారిఫ్‌ల విషయంలో ట్రంప్ భారత్‌తో వ్యవహరిస్తున్న తీరు, దానికి దీటైన ప్రతిస్పందన ఇవ్వడంలో మోదీ ప్రభుత్వ వైఫల్యం, తన కీలక బలాలైన జాతీయవాద, దేశభక్తి భావనల్లో బీజేపీ ప్రతిష్ఠను నష్టపోయేట్టు చేసింది. ఆగస్టు 15 ఎర్రకోట ప్రసంగం మోదీకి ఒక కీలకమైన అవకాశం. ఆర్థిక రంగంలో అమెరికా చేస్తున్న అన్యాయమైన ఒత్తిడిని, పాకిస్థాన్‌తో అది చేస్తున్న మైత్రిని స్పష్టమైన, దృఢమైన స్వరంతో ఆయన ఖండించి ఉండవలసింది. కానీ, తిరిగి పాకిస్థాన్‌ను ఉద్దేశించి మాత్రమే ప్రధాని భీషణ ప్రతిజ్ఞలు చేశారు. అమెరికా సుంకాల దాడి నుంచి దేశరైతాంగాన్ని కాపాడతామని చెప్పవలసింది పోయి, భారతీయ రైతులకు దక్కవలసిన సింధుజలాలను కాపాడుకుంటామని ఆయన చెప్పారు. రాహుల్ గాంధీ లోక్‌సభలో చెప్పినట్టు, చైనా చొరబాటును కానీ, అమెరికా ఒత్తిడిని కానీ ఎదుర్కొనలేని బలహీనతలో కేంద్రం పడిపోయింది. పాకిస్థాన్‌కు మాత్రమే హెచ్చరికలు చేయగలిగే స్థితిలో ఉండడం జాతీయవాద ఫ్రంట్‌లో బీజేపీ ప్రభుత్వ బేలతనాన్ని సూచిస్తోంది.

ఈ నెల ఏడో తేదీన రాహుల్ గాంధీ పేల్చిన 'ఆటంబాంబు' మోదీ ప్రభుత్వాన్ని చాలా సంకటంలో పడవేసింది. ఓట్ల దొంగతనానికి సంబంధించి ఎన్నికల కమిషన్ మీద సోదాహరణంగా చేసిన విమర్శలు, సమాధానం లేనివి. ఎన్నికల సంఘం చాలా బలహీనమైన ప్రతిస్పందనలు మాత్రమే ఇవ్వగలిగింది. ఎన్నికల సంఘాన్ని సమర్థించుకుంటూ రంగంలోకి దిగడం బీజేపీని సహముద్దాయిని చేసింది. ఎన్నికల సంఘం-బిజెపి కలసి ఈ ఓట్ల దొంగతనం చేస్తున్నారన్నట్టు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణకు బలం చేకూరింది. రాహుల్ వెల్లడించిన వివరాలకు సమాధానం ఇవ్వకుండా, పోటీ ఆరోపణలు చేయడం, సాంకేతికంగా మార్పిడి చేసిన డాక్యుమెంట్లను ప్రచారంలో పెట్టడం, బీజేపీని మరీ పలచన చేసింది. రాహుల్ గాంధీ బెంగుళూరులోని ఒక నియోజకవర్గాన్ని నమూనాగా తీసుకుని పరిశోధన చేశారు కానీ, ఆయన అక్రమాలను ఆవిష్కరించిన సందర్భం ఎన్నికల సంఘం బిహార్‌లో నిర్వహిస్తున్న 'సర్' (ఓటర్ల జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ) కార్యక్రమం. తాను బయటపెట్టిన 'ఓట్ల దొంగతనం' నేపథ్యంలోనే, ఈ ఆదివారం నుంచి రాహుల్ గాంధీ బీహార్‌లో 'ఓట్ అధికార్ యాత్ర'ను తలపెట్టారు. దీనికంతా కూడా అతిత్వరలో జరగనున్న బీహార్ ఎన్నికలు నేపథ్యం అన్నది తెలిసిందే. సుప్రీంకోర్టు 'సర్' విషయంలో పారదర్శకత కోరుతూ ఆదేశాలు ఇవ్వడం కూడా ఈ వాతావరణంలోనే జరిగింది. బీహార్ ప్రయోగం ద్వారా కేంద్రప్రభుత్వం ఆశించిన ఫలితాలు ఇప్పుడు సమకూరకపోవచ్చు. ఎర్రకోట ప్రసంగంలో ఈ ఉదంతాన్ని ప్రధాని ప్రస్తావించలేదు. కానీ, తాము దేశమంతటా చొరబాటుదారులు, అక్రమ వలసదారులను (ఘుస్‌పేటియే) గుర్తించి చర్యలు తీసుకోవడం గురించి గొప్పగా చెప్పారు. సరిహద్దుల నుంచి వస్తున్న ఈ పరాయివారు, భారతీయుల ఉద్యోగాలను, వ్యాపారాలను అపహరిస్తున్నారని, ఆడవాళ్లను కూడా లాగేసుకుంటారని, ఏమంత హుందాగా లేని రీతిలో హెచ్చరించారు. 'సర్' కార్యక్రమానికి ఈ చొరబాటుదారుల తొలగింపును సమర్థనగా ప్రచారం చేసి, రాహుల్ యాత్రను బీజేపీ ఎదుర్కొనే అవకాశం ఉంది. కానీ, రాహుల్ గాంధీ వెల్లడి వల్ల, దేశప్రజలకు ఓటర్ల జాబితాల మీద, ఎన్నికల ప్రక్రియ మీద, మొత్తంగా ఎన్నికల యంత్రాంగం మీద అపనమ్మకం అయితే ఏర్పడింది. ఆ అపనమ్మకాన్ని ఈ చొరబాటుదారుల ప్రక్షాళన ఆశయం ఎదుర్కొనగలదా? ఓటర్ల తొలగింపునకు బీజేపీ, మోదీ చెబుతున్న కారణాలను ప్రజలు నమ్ముతారా?

రాహుల్ వెల్లడి వల్ల ఎన్నికల సంఘమే కాదు, ప్రధాన మీడియా కూడా మరోసారి బోనెక్కింది. మీడియా ప్రాధాన్యాలు ఎట్లా ఉంటాయో, ఎంతగా తిమ్మిని బమ్మి చేస్తాయో, రాహుల్ సుదీర్ఘ ప్రెస్‌మీట్‌కు ఇచ్చిన కవరేజ్



బట్టబయలు చేసింది. ఒక ప్రజాప్రాముఖ్యమున్న అంశాన్ని అప్రధానం చేయడంలో ఎవరు ఎవరితో కుమ్మక్కై పని చేస్తున్నారో ఏమంత రాజకీయ పరిజ్ఞానం లేని సామాన్యులకు కూడా అర్థమైపోయింది. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభం అని చెప్పే మీడియా పతన దశ గురించి ఇంతకుముందు నుంచి అనుకుంటున్నదే కానీ, ఈ ఘట్టంలో అది తిరుగులేని వాస్తవంగా ముందుకు వచ్చింది. 'సర్' మీద కొంత సానుకూల నిర్ణయాన్ని ప్రకటించి న్యాయవ్యవస్థ ఆశను మిగిల్చింది కానీ, ఇటీవలి పరిణామాలు తక్కిన వ్యవస్థలన్నిటి మీద తీవ్రమైన సంశయాన్ని కలిగించాయి. ఈ సంశయస్థితిని ఎంతోకొంత సవరించలేకపోతే, ప్రభుత్వానికి ఆమోదనీయత ఉండదు. అది లేకపోతే, అధికారంలో కొనసాగడానికి మరింత తీవ్రమైన నిరంకుశ విధానాలను అనుసరిస్తూ, హెచ్చుస్థాయిలో బలప్రయోగాన్ని, నిర్బంధచర్యలను ఆశ్రయించవలసి వస్తుంది. లేదా, సంస్థాగతంగా కలిగే కల్లోలానికి గురి కావలసి వస్తుంది. ఎర్రకోట మీద తొలిసారిగా ఒక ప్రధాని ఆర్‌ఎస్‌ఎస్‌ను కీర్తించడం విశేషమే. ఆ సంస్థ నూరేళ్ల పండగ సందర్భంగా ఒక సంఘ్ ప్రచారక్ అయిన మోదీ ఆ పని చేయడాన్ని అర్థం చేసుకోవచ్చు. అంతమాత్రమేనా, ఈ సంక్షోభం నుంచి తనను గట్టెక్కించమని 'సంఘ్'కు అభ్యర్థన పంపడం కూడా ఆ ప్రశంసలో ఇమిడి ఉందా? 75 వయస్సు సందర్భంగా ప్రభుత్వ సారథ్యంలో మార్పును 'సంఘ్' కోరుతోందని కథనాలు వచ్చాయి. మరో పక్క ప్రతిపక్షంలో ఐక్యత, చొరవ, క్రియాశీలత పెరిగాయి. ప్రభుత్వం దగ్గర కొత్త రాజకీయ ఆయుధాలు ఏవీ లేవని, పార్టీలో ప్రభుత్వంలో సృజనాత్మకత లోపించిందని ఎర్రకోట ప్రసంగం సూచిస్తోంది.

**'ధర్మం' అంటే అనేకార్థాలు ఉన్నాయి కానీ, ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల నిలకడకి ప్రజల ఆలోచనల్లో ఉండే ఆమోదనీయత అటువంటిదే. ఆ లెజిటమసీ అనే ధర్మం లోపించి, ఒక్కకాలు కూడా వ్యవస్థకు ఊతం అందించని స్థితి వచ్చింది. ఇరుసులు విరిగిన రథం ఎంత దూరం పరుగులు తీయగలదు?**



కె.శ్రీనివాస్
ప్రజాతంత్ర కోసం

---

## మహాత్ముని స్ఫూర్తి విశ్వజనీయం

**★ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచాన్ని తన ఆలోచనలతో, నడవడికతో ప్రభావితం చేసిన మహాత్మా గాంధీ స్ఫూర్తి విశ్వజనీయమైనదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. జిల్లా పర్యటనకు బుధవారం విచ్చేసిన ఆయన శ్రీకాకుళం స్వాతంత్ర్య సమరయోధులు, సంఘసంస్కర్తల స్మృతివనాన్ని సందర్శించారు. మహాత్ముని విగ్రహానికి పూలమాలలు వేసి రఘుపతి రాఘవ రాజారాం కీర్తన ఆలపించారు. అనంతరం మాధవ్ మాట్లాడుతూ గాంధీజీతో పాటు భారత స్వాతంత్ర్య సమరంలో త్యాగాలు చేసిన మహనీయులందరిని ఒకే చోటికి చేర్చడం గొప్ప విషయమన్నారు. సమరయోధులు, సంఘసంస్కర్తలు, ప్రపంచాన్ని ప్రభావితం చేసిన స్ఫూర్తిదాతల విగ్రహాలను ప్రతిష్టించడంతో పాటు 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండాని సగర్వంగా ఎగురవేయడం దేశంలోనే అరుదైన ప్రదేశంగా నిలుస్తుందన్నారు. అనంతరం గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు నిక్కు అప్పన్న, బరాటం లక్ష్మణరావు, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్, నక్క శంకరరావు, మహీబుల్లా ఖాన్, కొమ్ము రమణమూర్తి, జి.నాగేశ్వరరావు, రాజు, శాస్త్రి మాధవ్‌ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురపు తేజేశ్వరరావు, పార్టీ రాష్ట్ర నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, బిర్లంగి ఉమామహేశ్వరరావు, గొలివి కరుణాకర్, పైడి రాజారావు, పూడి బాలాదిత్య, పార్టీ వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి నుంచి ఎంట్రప్రెన్యూర్ రావాలి..

(సత్యంన్యూస్, అమరావతి)

రతన్ టాటా భరత జాతి ముద్దుబిడ్డ అని ఏపీ సీఎం చంద్రబాబు కొనియాడారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు ప్రసంగించారు. దేశానికి ఏదైనా చేయాలని రతన్‌టాటా తపించేవారని, సమాజసేవకు ఆయన జీవితాంతం కృషి చేశారని అన్నారు. ప్రతిఒక్కరూ డబ్బు సంపాదించాలనే చూస్తారని, కానీ ఆయన మాత్రం సంపాదించిన డబ్బును సమాజానికి తిరిగిచ్చేవారని, రతన్‌టాటా ఆలోచనలు సజీవంగా ఉంచాలని ఇన్నోవేషన్ హబ్ ప్రారంభిస్తున్నామని, ప్రతి కుటుంబం నుంచి ఎంట్రప్రెన్యూర్ రావాలనేదే తన నినాదమన్నారు. గతంలో ప్రతి ఇంటి నుంచి ఒక ఐటీ ఉద్యోగి ఉండాలని కృషి చేశానని, భవిష్యత్ అంతా ఐటీ రంగానిదే అని గుర్తించానని, సరైన ప్రభుత్వ విధానాలు అవలంభిస్తే ఆదాయం, సంపద వస్తుందని చంద్రబాబు అన్నారు.

**రతన్ టాటాకు అంకితం: నారా లోకేశ్**

వినూత్న ఆలోచనలతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలకు పారదర్శకంగా ప్రోత్సాహకాలు కల్పించేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కీలక వేదిక కానుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆలోచనలకు తగ్గ ఫలితాల సాధనే లక్ష్యంగా ఈ వేదిక



పని చేస్తుందన్నారు. ఇందుకనుగుణంగా విద్యా వ్యవస్థ పునాదులు బలోపేతం చేసి విద్యార్థి దశ నుంచే ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ముందున్న సవాళ్లకు తగ్గట్టుగానే అవకాశాలను అందిపుచ్చుకునే కార్యాచరణతో పనిచేస్తున్నట్లు చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ రాష్ట్రంలో పని చేస్తున్నందున దేశానికి ఏపీ ఆవిష్కరణల హబ్‌గా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. వ్యాపారం అంటే లాభాలు మాత్రమే కాదని.., విలువలు, మానవత్వంతో కూడిన పని అని చాటిన మహనీయుడు రతన్ టాటా అని కొనియాడారు. అలాంటి మహోన్నత వ్యక్తికి ఈ వినూత్న ఆవిష్కరణల వేదికను అంకితమిస్తున్నట్లు తెలిపారు.

## ఆదిత్యుని దర్శించుకున్న మాధవ్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని బుధవారం బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ పీవీఎన్ మాధవ్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, కార్యనిర్వహణాధికారి సూచనల మేరకు ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు, పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి, స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



### గ్రంథాలయోద్యమానికి స్థిరమైన
## రూపురేఖలు దిద్దిన కళా ప్రపూర్ణ పాతూరి

- **గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు**
- **లావేరు గ్రంథాలయంలో నాగభూషణం జయంతి**
- **పాతూరి జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీ**



(సత్యంన్యూస్, లావేరు)

కళా ప్రపూర్ణ పాతూరి నాగభూషణం జయంతిని లావేరు శాఖా గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాతూరి చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమానికి స్థిరమైన రూపురేఖలు దిద్దిన కళా ప్రపూర్ణ పాతూరి నాగభూషణం అని అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి తాలూకా పెద్దపాలెంలో జన్మించిన ఈయన వయోజన విద్య ద్వారా ఎంతోమందిని చైతన్యం చేశారని, బోటు గ్రంథాలయాల ఆలోచనకు అమలుకు మొదట కృషిచేసిన వ్యక్తి పాతూరి నాగభూషణం అని తెలిపారు. పాతూరి జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన కే.రాజేష్‌కు గ్రంథాలయం తరపున ప్రథమ బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# కూనది కేవలం సిఫారసే.. ఏపీసీ చేసింది 'ఫార్సే'!

(మొదటిపేజీ తరువాయి)

ఆ సీట్లను ఆఫ్‌లైన్‌లో స్థానికంగా భర్తీ చేసుకుంటున్నామన్న సాకుతో కొందరు విద్యార్థులకు అవకాశం ఇవ్వొచ్చు. సరిగ్గా ఇటువంటి సీట్లకే స్థానిక నాయకుల నుంచి సిఫార్సు లేఖలు వస్తుంటాయి. అందరిలాగే కూన రవికుమార్ కూడా తన నియోజకవర్గ పరిధిలోని లోలుగు కేజీబీవీకి రికమెండ్ చేస్తూ కొందరు విద్యార్థులకు లేఖలిచ్చారు. కానీ తాను లేఖలు ఇచ్చిన వారికి కాకుండా ప్రతిపక్షానికి చెందిన నేత చెప్పిన కొందరికి సీట్లు వచ్చాయన్న విషయం కూన రవి దృష్టికి వచ్చింది. సరిగ్గా ఇదే సమయంలో పేరెంట్స్ కమిటీ సభ్యులతో పాటు కొందరు పేరెంట్స్, అక్కడ పని చేస్తున్న సిబ్బంది ప్రిన్సిపాల్ సౌమ్యపై ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు ఫిర్యాదులు పరిశీలించి చర్యలు తీసుకోవాలంటూ ఎమ్మెల్యే కూన రవికుమార్ ఏపీసీ శశిభూషణ్‌కు లేఖ రాశారు.

**ఎమ్మెల్యే సిఫార్సే సాకుగా..**

అంతే.. 'ఎద్దు ఈనిందంటే దూడను గట్టున కట్టేయండి' అన్న చందంగా ఏపీసీ శశిభూషణ్ ముందూవెనకా చూడకుండా.. ఎమ్మెల్యే మెప్పు కోసం నేరుగా కలెక్టర్‌కు ఫైల్ పెట్టి సౌమ్యపై బదిలీ వేటు చేయించారు. అక్కడి నుంచే గందరగోళం మొదలైంది. తనను కూన రవికుమార్ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ సౌమ్య మీడియాకెక్కారు. ఆమెకు మద్దతుగా కొన్ని సంఘాలు సమగ్రశిక్ష కార్యాలయం వద్ద ధర్నా కూడా చేశాయి. ఆ వెంటనే దళిత సంఘాలు రంగంలోకి దిగాయి. అయినా తన బదిలీని అధికారులు నిలపకపోవడంతో సౌమ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడి వివాదాన్ని క్లైమాక్స్‌కు తీసుకువచ్చారు. వాస్తవానికి సౌమ్యపై ఫిర్యాదులు వచ్చాయంటూ ఎమ్మెల్యే కూన లేఖ ఇచ్చిన తర్వాత ఏపీసీ హోదాలో నిబంధనల ప్రకారం విచారణ జరిపించాల్సి ఉంటుంది. ఆరోపణలు నిజమేనని విచారణలో తేలితే ఆ నివేదికను, ఎమ్మెల్యే పంపిన ఫిర్యాదులను జోడించి తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ కలెక్టర్‌కు నోట్‌ఫైల్ పెట్టాల్సి ఉంటుంది. ఇది సర్క్యులేట్ అయిన తర్వాత చర్యలకు ఉపక్రమిస్తారు. కానీ సౌమ్య ఉదంతంలో ఏపీసీ ప్రొసీజర్ పాటించకుండా, విచారణ లేకుండానే నేరుగా కలెక్టర్‌కు ఫైల్ పెట్టేసి ఎమ్మెల్యే సిఫార్సు చేసినందున సౌమ్యను బదిలీ చేయండంటూ రికమెండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా బదిలీల ప్రక్రియ నడుస్తుండటంతో ఇది కూడా రొటీన్ ట్రాన్స్‌ఫరే అనుకొని కలెక్టర్ సంతకం చేసేశారు.

**ఇప్పుడు విచారణల పేరుతో హడావుడి**

కానీ కథ అడ్డంతిరిగి సౌమ్య ఉదంతం రోడ్డెక్కింది. దీంతో చేతులు కాలిపోతున్నాయని గ్రహించిన కలెక్టర్ పొందూరు కేజీబీవీపై విచారణకు ఆర్జేడీని నియమించినట్లు ప్రకటించారు. ఇదే పని ఫిర్యాదు అందిన వెంటనే చేయాల్సింది. అలా అయితే విచారణకు ఆర్జేడీ అవసరం కూడా ఉండదు. ప్రిన్సిపాల్ కంటే పైఅధికారి ఎవరో ఒకర్ని నియమిస్తే సరిపోతుంది. అయితే కూన రవికుమార్ డ్యామేజ్ అవుతుండటంతో ఆర్జేడీని రంగంలోకి దించారు. కానీ అప్పటికే జరగాల్సిందంతా జరిగిపోయింది. సౌమ్యపై చర్యలకు సిఫార్సు చేస్తూ ఆయా సెక్షన్ల నుంచి లేఖ పంపించాలని కోరితే సమగ్రశిక్ష కార్యాలయంలోని సంబంధిత గుమస్తాలు కూడా కుదరదన్నారట. ప్రొసీజర్ అది కాకపోవడమే వారి నిరాకరణకు కారణం. దీంతో చేసేది లేక ఏపీసీ తన విచారణాధికారాల మేరకు కలెక్టర్‌కు లేఖ రాస్తున్నట్టు పేర్కొన్నారు.

**శశిభూషణ్ 'లెక్కే' వేరు!**

ప్రిన్సిపాల్ సౌమ్యపై ఆరోపణలున్నమాట వాస్తవం. అలా అని మిగిలిన కేజీబీవీ ప్రిన్సిపాళ్ల మీద లేవని కాదు. కానీ సౌమ్య విషయంలో ఇంత రచ్చ జరగడానికి కారణం ఏపీసీనే. తనకు వ్యతిరేకంగా ఉన్నవారిని తప్పించడానికి కేజీబీవీ ప్రిన్సిపాళ్లను పావుగా వాడుకోవడం శశిభూషణ్‌కు కొత్త కాదు. ఇక్కడ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసిన మీసాల రమేష్‌నాయుడుపై ఆరోపణలున్నాయని, ఆయన్ను అక్కడి నుంచి పంపిస్తే గానీ తనకు 'లెక్కలు' కుదరవని భావించిన ఏపీసీ తనకు అనుకూలంగా ఉండే కొందరు ప్రిన్సిపాల్స్‌తో పిటిషన్ పెట్టించి ఆయన్ను ఇక్కడి నుంచి కదిపేశారు. దీంతో కేజీబీవీ ప్రిన్సిపాల్స్ ఏపీసీని తమ పైఅధికారిగా భావించడం మానేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి స్పెషలాఫీసర్‌గా ఉన్న ఏపీసీ శశిభూషణ్ పనిలో పనిగా ఆ ప్రాంతంలో ఉన్న కేజీబీవీలకు వెళ్తుంటారు. అలాగే తన సొంత ప్రాంతం పాతపట్నం, మెళియాపుట్టి వెళ్లాల్సివస్తే ఆన్‌డ్యూటీ కింద ఆఫీస్ వెహికల్‌లో వెళ్లి.. ఆ దారిలో ఉన్న కేజీబీవీలను తనిఖీ చేస్తుంటారు. కానీ జిల్లాలో మిగతావాటిపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. అదేవుంటే ఆమధ్య ఓ కేజీబీవీలో మైనర్ బాలికలు బీర్ తాగుతూ గ్రామస్తుల కంట పడటం, మరోచోట ఫుడ్ పాయిజినింగ్ కావడం వంటి ఘటనలు జరిగేవి కావు. శశిభూషణ్ ఏ కులం కార్డుతో ఏపీసీగా వచ్చారో ఇప్పుడు అదే కులానికి చెందిన రవికుమార్ రాజకీయ జీవితంపై మరక మిగిల్చారు. ఇంకా విచిత్రమేమిటంటే.. శ్రీకాకుళం కేంద్రానికి పక్కనే ఉన్న లోలుగు కేజీబీవీని ఏపీసీ ఇంతవరకు తనిఖీ చేయలేదు. ఎమ్మెల్యే అక్కడి ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేసినప్పుడైనా ఏపీసీ క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో పరిశీలించాల్సింది. కానీ అలా చేయలేదు. అంటే.. ఎక్కడో పంపకాలు సమస్య ఉండి ఉండాలి. సందట్లో సడేమియా అన్నట్లు సౌమ్యతో పాటు మరో ఇద్దరు కేజీబీవీ ప్రిన్సిపాళ్లను గుట్టుచప్పుడు కాకుండా ఏపీసీ కదిపేశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఫిర్యాదు చేశారంటూ గార కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను బదిలీ చేశారు. ఆమెను సౌమ్య స్థానంలో నియమించారు. కంచిలి ప్రిన్సిపాల్‌ను గారకు పంపించారు. పొందూరు నుంచి సౌమ్యను కంచిలి పంపించారు. ఇప్పుడు ఇద్దరు ప్రిన్సిపాళ్లు జిల్లా కేంద్ర సమీపంలోకి రావడానికి ఏపీసీకి ఎంతోకొంత ముట్టజెప్పి ఉంటారని భావించినవారూ లేకపోలేదు. ఇప్పుడు కథంతా ముగిసిపోయే సమయానికి కలెక్టర్ కూడా ఈ ఆరోపణలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఒకర్ని విచారణకు నియమించారు. వాస్తవానికి ఈ పని ఏపీసీ చేసి, ఆ నివేదిక మేరకు అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్ కింద సౌమ్యను బదిలీ చేస్తున్నామని ప్రకటించి ఉంటే ఈ గొడవ ఉండేది కాదు. అలా కాకుండా కలెక్టర్‌కు పెట్టిన ఫైల్‌లో ఎమ్మెల్యే సిఫార్సు లేఖ పెట్టేసి బదిలీ చేయించడం వల్ల మొత్తం పెంట పెంట అయిపోయింది.

# ఆధునిక వ్యవసాయ, అనుబంధ శాఖల సాంకేతికత అవసరం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు ఆధునిక వ్యవసాయ, అనుబంధ శాఖల సాంకేతిక అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శ్రీకాకుళం రూరల్, ఒప్పంగి గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో బుధవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ శాఖల పథకాలపై రైతులుకు అవగాహన కల్పించడంతోపాటు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో-ఆపరేటివ్ లిమిటెడ్ నుండి తయారు కాబడిన నానో కాపర్, నానో యూరియా ప్లస్, నానో డిఏపి, నానో జింక్ వంటి ఇఫ్ కో నానోఎరువులతో పాటు, సిఐఎల్ కంపెనీ నానో డిఏపి, ఐపిఎల్ కంపెనీ వారి నానో యూరియా నానో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, డ్రోన్ స్ప్రేయర్లును రైతులకు పరిచయం చేశారు. ఇవన్నీ రైతులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ ఎరువులు గాలి, నీటి కాలుష్యాన్ని తగ్గిస్తూ పంట నాణ్యత, ఉత్పత్తిని పెంచుతాయన్నారు. సాంప్రదాయ ఎరువుల కంటే తక్కువ ధర, నిల్వ, రవాణాలో సులభతరమన్నారు. నానో ఎరువుల స్ప్రే కోసం ఇఫ్ కో 6 ఇఫ్ కో కిసాన్ డ్రోన్, 20 కిసాన్ డ్రోన్లు, 11 నమో దీదీ డ్రోన్లు అందుబాటులో ఉంటాయని, డ్రోన్ కొరకు ఇఫ్ కో ఫీల్డ్ ఆఫీసర్స్‌ను సంప్రదించాలన్నారు. డ్రోన్లు కోసం మండల వ్యవసాయ అధికారులు, రైతు సేవా కేంద్రాలను సంప్రదించవచ్చన్నారు. నానో యూరియా ప్లస్, నానో డిఐపి స్ప్రేయింగ్‌పై రైతుకు అవగాహన కొరకు ఏర్పాటు డ్రోన్ ఆయన పరిశీలించారు. నానో యూరియా ప్లస్‌లి అనేది భారతదేశంలో తయారైన సబ్సిడీ లేని ఎరువులన్నారు. నానో యూరియా ప్లస్ యొక్క వినియోగం పర్యావరణానికి హాని కలిగించకుండా పంటల నత్రజని అవసరాన్ని తీరుస్తుందన్నారు. కీలకమైన పంట పెరుగుదల దశలలో నానో యూరియా ప్లస్‌ను ఆకులపై పిచికారీ చేయడం వలన పైపాటుగా వేసే యూరియా వాడకాన్ని 50% వరకు తగ్గించవచ్చన్నారు.

నానో యూరియా ప్లస్ యొక్క నానో పరిమాణం 20-50మి.లీ. ఉంటుందని, ఇందులో నానో కణాలు పాలిమర్ కోటింగ్‌తో ఉంటాయన్నారు. ఇది పత్రరంధ్రాలు, ఆకు/వైమానిక భాగాల ఇతర రంధ్రాల ద్వారా సులభంగా ప్రవేశించి పంటలకు ఎక్కువ నత్రజనిని అందిస్తుందని తెలిపారు. నానో యూరియా ప్లస్ లోని నానో నైట్రోజన్ క్లస్టర్లు, బయో-పాలిమర్లు, ఇతర ఎక్సిపియెంట్లతో పనిచేస్తాయని, దీనికి మెరుగైన వ్యాప్తి సామర్థ్యం, సమీకరణ వలన ఎక్కువ క్లోరోఫిల్, కిరణజన్య సంయోగ క్రియ సామర్థ్యం, మెరుగైన నాణ్యత, మెరుగైన పంట దిగుబడి లభిస్తుందని వివరించారు. నానో డి.ఎ.పి. కణ పరిమాణం 100 నానోమీటర్ కంటే తక్కువగా ఉండటం వలన ఘన పరిమాణం పరంగా ప్రయోజనాన్ని కలిగి ఉంటుందని, ఈ ప్రత్యేక లక్షణం విత్తనం లేదా వేర్ల ఆకు, ఇతర మొక్కల రంధ్రాల ద్వారా సులభంగా ప్రవేశించడానికి వీలు కల్పిస్తుందని తెలిపారు. ఆ నానో డి.ఎ.పి.లోని నత్రజని, భాస్వరం నానో క్లస్టర్లు, బయోపాలిమర్లు, ఇతర సహాయక పదార్థాలతో పనిచేస్తాయన్నారు. మొక్కల వ్యవస్థ లోపల నానో డీఏపీ మెరుగైన వ్యాప్తి సామర్థ్యం, సమీకరణ వలన అధిక విత్తనశక్తి, ఎక్కువ క్లోరోఫిల్, కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం, మెరుగైన నాణ్యత, పంట దిగుబడి పెరుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. సాధారణంగా వేసే నత్రజని ఎరువులలో 30%-40%, ఫాస్ఫేటిక్ ఎరువులలో 15%-20% మాత్రమే పంటలకు అందుబాటులో ఉంటాయన్నారు. మిగిలిన, ఉపయోగించని నత్రజని, భాస్వరం రూపాలు మన నేల, గాలి, నీటిని కలుషితం చేస్తాయని పేర్కొన్నారు. నానో డీఏపీ పర్యావరణానికి హాని కలిగించకుండా పంటల పోషక అవసరాలను తీర్చడంలో సహాయపడుతుందని చెప్పారు. కీలకమైన పంట పెరుగుదల దశలలో నానో డి.ఎ.పి.ని విత్తనం లేదా వేరు శుద్ధికి వాడటం మరియు తరువాత పంట అవసరాన్ని బట్టి ఆకులపై ఒకటి నుండి రెండుసార్లు పిచికారీ చేయడం వల్ల సాధారణంగా ఉపయోగించే సాంప్రదాయ డి.ఎ.పి.లో 50%-75% వరకు తగ్గించవచ్చన్నారు.

నానో కాపర్ పంట జీవక్రియని మరియు దిగుబడిని పెంచుతుందన్నారు. ఇఫ్కో నానో కాపర్ 8000 పి.పి.ఎం. (0.8%) మొక్కల పెరుగుదల, రక్షణ విధానాలను సులభతరం చేసే మల్టీఫంక్షనల్ ఏజెంట్‌గా పనిచేస్తుందన్నారు. నానో కొలోయిడల్ టెక్నాలజీని ఉపయోగించి మొక్కలలో కాపర్ పోషకం కదలికను మెరుగుపరచబడుతుందన్నారు. నానో కాపర్ వలన పంట ఉత్పాదకతను పెంచే అవసరమైన పోషకాలను మొక్క తీసుకోవడాన్ని మెరుగుపరుస్తుందన్నారు. నానో కాపర్ వినియోగం వలన మొక్కలలో క్లోరోఫిల్‌ను మరియు ఇతర జీవక్రియలను మెరుగుపరుస్తుందని తెలిపారు. నానో జింక్ ఇఫ్కో నానో జింక్ (1%) ఫార్ములేషన్, మొక్కల పెరుగుదల,పంట దిగుబడికి దోహదపడుతుందన్నారు. మొక్కల పెరుగుదలను పెంచుతుందన్నారు. పోషకాల సంగ్రహణ, వేర్ల విస్తరణను మెరుగు పరుస్తుందని చెప్పారు. పూత, పండ్ల అమరికను మెరుగుపరుస్తుందన్నారు. పంటలలో మెరుగైన పునరుత్పత్తి అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. పర్యావరణ ప్రతికూల పరిస్థితులలో మొక్కకు రక్షణ కవచంగా పనిచేస్తుందన్నారు. డ్రోన్ స్ప్రేయర్లు ద్వారా ఒక ఎకరా పంట విస్తీర్ణానికి 10-20 లీటర్ల కలిగిన ట్యాంకుకు 250-500 మిలీ? నానో యూరియా ప్లస్ సరిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి త్రినాధస్వామి, మండల వ్యవసాయ అధికారి పి.నవీన్ కుమార్, గ్రామ సర్పంచ్ చల్ల వాణి దేవి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖలో జరుగుతున్న అవినీతిపై దర్యాప్తు చేపట్టాలి

(సత్యంన్యూస్, టెక్కలి)

వ్యవసాయ శాఖలో మంత్రి అచ్చెన్నాయుడు చేస్తున్న అవినీతిపై బహిరంగ దర్యాప్తు చేపట్టి, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైకాపా టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం టెక్కలి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు సబ్సిడీపై అందజేసే వ్యవసాయ పనిముట్లులో అచ్చెన్నాయుడు తన ఓఎస్డీ పోలినాయుడుతో అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. పనిముట్లు తయారు చేసే కంపెనీలతో మధ్యవర్తిత్వం వ్యవహరించి డబ్బులు వసూలు చేయాలని ఆగ్రో జీఎంపై ఒత్తిడి తీసుకువచ్చారని, ఆ పనికి ఆయన ఒప్పుకోకపోవడంతో నెల్లూరు బదిలీ చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై దర్యాప్తు చేయించి మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. 2018లో తితిలీ తుఫాను వలన నష్టపోయిన రైతాంగానికి ఇన్సూరెన్స్‌ను తెలుగుదేశం పార్టీ ఇవ్వకపోగా రైతాంగానికి 2019లో ఇన్సూరెన్స్ సబ్సిడీ అందజేసి ఆదుకున్న ఘనత జగన్మోహన్ రెడ్డిదేనన్నారు. నందిగాం మండలంలో నిర్మాణం పూర్తయిన విత్తనోత్పత్తి కేంద్రానికి మిగతా సదుపాయాలు కల్పించి దానిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అచ్చెన్నాయుడు, తన కుటుంబ సభ్యులు నిరంతరం అవినీతిపైన దృష్టి సారిస్తున్నారు తప్ప అభివృద్ధిలో గాని రైతు సమస్యలు పరిష్కారం పైన గాని దృష్టిసారించడం లేదని విమర్శించారు. రైతులకు యూరియా పంపిణీకి నేటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. టెక్కలిని జిల్లా కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్న కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీ హామీగానే మిగిలిందన్నారు. కొంతమంది తెలుగుదేశం నాయకులు అవగాహన రాహిత్యంతో అచ్చెన్నాయుడు పాల్పడుతున్న అవినీతికి మద్దతు తెలపడం సిగ్గుచేటన్నారు. రైతులకు ఉచిత పంటల భీమా ప్రీమియం ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురునాథ్ యాదవ్, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంత రెడ్డి, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు, సంపతిరావు, హేమ సుందర రాజు, తమిరి ఫాల్గుణరావు, కిల్లి అజయ్, పోలాకి మోహనరావు, కర్ణిక జీవన్, పేరాడ వెంకట్రావు, బమ్మిడి కూర్మారావు, పినకాన వైకుంఠరావు, టంకాల హిమాకర్, టంకాల బాబురావులు పాల్గొన్నారు.



## యూనియన్ ఐక్యత వర్ధిల్లాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ముందుగా యూనియన్ జెండాను ఆవిష్కరించి యూనియన్ ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేసి, జెండా వందనం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఈ సమావేశం శ్రీకాకుళంలో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో కార్మికుల సంక్షేమం, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. భారతదేశంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు భవన నిర్మాణ బోర్డులు పలు రాష్ట్రాలు ఏర్పాటు చేశాయని, మన రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భవన్ నిర్మాణ బోర్డును నిలుపుదల చేశారని ఇప్పుడు కూటమి ప్రభుత్వం దాన్ని పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. అలాగే డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. మహీ బుల్లాఖాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస రావు, యూనియన్ స్థానిక నాయకులు తోట తారకనాథ్, బాలకృష్ణ మామిడి క్రాంతి, జిల్లా అధ్యక్షులు సువ్వారి బాలకృష్ణ, ,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పత్రిక ప్రచురుణార్థం తే 20-08-2025 శ్రీకాకుళం : భారత ప్రభుత్వం యువజన వ్యవహారములు మరియు క్రీడలు మంత్రత్వ శాఖ మేరా యువ భారత్ వాలంటీర్స్ గుండ వసంత లక్ష్మి, అరుగుల దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం శాంతినికేతన్ జూనియర్ కళాశాల సమావేశ మందిరం యందు సద్భావన దివస్ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెటశ్రీ సూపరిండెండెంట్ ఎల్ రేఖ పాల్గొని మాట్లాడుతూ జాతీయ సమైక్యత, మత సామరస్యం మరియు ప్రజల మధ్య స్నేహాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారని, సద్భావన దివస్ భారతదేశ ప్రజలందరినీ ఒకేతాటిపైకి తెచ్చేందుకు ఉద్దేశించబడిందని కుల, మత, ప్రాంత బేధాలు లేకుండా అందరూ కలిసి జీవించాలని కోరుకుంటుందని, సద్భావన దివస్, అహింసను పాటించాలని మరియు హింసను విడనాడాలని కోరుతుందని అన్నారు. శాంతినికేతన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. అప్పలరాజు మాట్లాడుతూ అన్ని మతాల భారతీయుల మధ్య జాతీయ ఐక్యత, శాంతి, సానుభూతి మరియు మత సామరస్యాన్ని పెంపొందించడానికి సద్భావన దివస్ దినోత్సవాన్ని జరుపుకుంటారన్నారు . ఈ సందర్భంగా మేరా యువ భారత్ గుండ వసంత లక్ష్మి సద్భావన దివస్ ప్రతిజ్ఞ "కులం, ప్రాంతం, మతం లేదా భాషతో సంబంధం లేకుండా భారతదేశంలోని ప్రజలందరి భావోద్వేగ ఐక్యత మరియు సామరస్యం కోసం నేను కృషి చేస్తానని నేను ఈ గంభీరమైన ప్రతిజ్ఞ చేస్తున్నాను. హింసను ఆశ్రయించకుండా చర్చలు మరియు రాజ్యాంగ మార్గాల ద్వారా మన మధ్య ఉన్న అన్ని విభేదాలను పరిష్కరిస్తానని కూడా నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను." అని యువకులతో ప్రతిజ్ఞ చెయ్యించారు. ఈ కార్యక్రమంలో శాంతినికేతన్ జూనియర్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి వి నర్సింహులు, లిఫెఫ్యూయల్ సర్వీస్ ఆర్గనైజషన్ జాయింట్ సెక్రెటరీ ఎస్ వి పి సత్యనారాయణ, మేర యువ భారత్ వాలంటీర్స్ గుండ వసంత లక్ష్మి, అరుగుల దిలీప్ కుమార్, యువకులు తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ డైరెక్టర్ వారి కార్యాలయం మేరా యువ భారత్, శ్రీకాకుళం.




## ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మన దేశానికి ఐటీ టెక్నాలజీ పరిచయం చేసిన ఘనుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. నేడు దేశంలో గల ఆధునిక పరిజ్ఞానానికి ఆద్యుడు రాజీవ్ గాంధీ అన్నారు. ఆనాడే ఎంతో ముందుచూపుతో టెక్నాలజీ అవసరాన్ని గ్రహించి భారత దేశంలో టెక్నాలజీ అభివృద్ధికి పునాదులు వేశారన్నారు. ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి భారతదేశ అభివృద్ధికి బాటలు వేశారని కొనియాడారు. కార్యక్రమంలో లఖినేని నారాయణరావు, సనపల రాజులు, లఖినేని సాయిరాం, పప్పల అప్పారావు, పూజారి త్రినాధరావు, రమేష్, రమణ, కిషోర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## 206 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు



(సత్యంన్యూస్, సంతబొమ్మాళి)

జాతీయ అంధత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ పి.అవని పర్యవేక్షణలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రతి ఏడాది తప్పనిసరిగా కంటిపరీక్షలు చేసుకోవాలని, దృష్టిలోపం ఉన్న వారికి కంటి అద్దాలు సూచించినట్లయితే వారు తప్పనిసరిగా ప్రతి నిత్యం ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ 206మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న 16మందికి ఉచిత కళ్లద్దాలకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కూన రవికుమార్‌కు శుభాకాంక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా అమెరికా పర్యటన విజయవంతంగా ముగించుకుని మంగళవారం జిల్లాకు విచ్చేసిన పీయూసీ రాష్ట్ర చైర్మన్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ఎంపీజే బాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ రవికుమార్ సేవలు ఆదర్శనీయమని, అందుకే ఆయన అందరివాడు అని కొనియాడారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.